నృసింహ శతకము

(మూలము)

ఇది

శేషప్పకవి విరచితము.

లలితా అండ్ కో

తెనాలి — ఏలూరు.

1946

 [వెల 0—4—0

నృసింహ శతకము

శేషప్పకవి విరచితము.



లలితా అండ్ కో.,
తెనాల — ఏలూరు.

 [వెల 0—4—0

మొదటి కూర్పు.

1000-(W. G. 36-'46.)

శ్రీ సీతారామాంజనేయ ప్రెస్,

ఏలూరు.

శ్రీ లక్ష్మీ నృసింహాయనమః.

నృ సిం హ శ త క ము.

శ్రీ మనోహర సురా ♦ ర్చిత సింధుగంభీర
భక్తవత్సలకోటి ♦ భాను తేజ
కంజనేత్ర హిరణ్య ♦ కస్యపాంతకశూర
సాధురక్షణ శంఖ ♦ చక్రహస్త
ప్రహ్లాదవరద పా ♦ పధ్వంస సర్వేశ
క్షీరసాగరశాయి ♦ కృష్ణవర్ణ
పక్షివాహన నీల ♦ భ్రమరకుంతలజాల
పల్లవారుణ పాద ♦ పద్మయుగళ

తే. చారు శ్రీచందనాగరు ♦ చర్చితాంగ
కుందకుట్మలదంత వై ♦ కుంఠధామ
భూషణవికాస శ్రీధర్మ ♦ పురనివాస
దుష్టసంహార నరసింహ ♦ దురితదూర ! 1

సీ. పద్మలోచన సీస ♦ పద్యముల్ నీమీదఁ
జెప్పఁబూనితినయ్య ♦ చిత్తగింపు
గణయతిప్రాస ల ♦ క్షణముఁ జూడగలేదు
పంచకావ్యశ్లోక ♦ పఠనలేదు
అమరకాండత్రయం ♦ బరసి చూడఁగలేదు
శాస్త్రీయగ్రంథముల్ ♦ చదువలేదు
నీకటాక్షంబున ♦ నేరచించెదఁగాని
ప్రజ్ఞనాయదిగాదు ♦ ప్రస్తుతింపఁ

తే. తప్పుపడనేమి సద్భక్తి ♦ తక్కువౌనె
చెఱకునకు వంకపోనేమి ♦ చెడునె తీపి॥ భూ॥ 2

సీ. నరసింహ నీదివ్య ♦ నామమంత్రముచేత
దురితజాలములన్నిఁ ♦ దోలవచ్చు
నరసింహ నీదివ్య ♦ నామమంత్రముచేత
బలువైనరోగముల్ ♦ బాపవచ్చు
నరసింహ నీదివ్య ♦ నామమంత్రముచేత
రిపుసంఘముల సంహ ♦ రింపవచ్చు
నరసింహ నీదివ్య ♦ నామమంత్రముచేత
దండహస్తుని బంట్ల ♦ దఱుమవచ్చు
తే. భళిర నే నీమహామంత్ర ♦ బలముచేత
దివ్యవైకుంఠ పదవి ♦ సాధింపవచ్చు॥ భూ॥ 3

సీ. ఆదినారాయణా ♦ యనుచు నాలుకతోడ
బలుకనేర్చినవారి ♦ పాదములకు
సాష్టాంగమగు నమ ♦ స్కార మర్పణఁజేసి
ప్రస్తుతించెదనయ్య ♦ బహువిధముల
ధరణిలో నరులెంత ♦ దండివారైనను
నిన్నుఁ గాననివారి ♦ నే స్మరింప
నేను శ్రేష్ఠుడనంచు ♦ నిక్కుచుండెడివాని
చెంతఁ జేరఁగబోను ♦ శేషశయన
తే. పరమ సాత్వికులైన నీ ♦ భక్తవరుల
దాసులకు దాసుడను జుమ్మి ♦ ధాత్రిలోన॥ భూ॥ 4

సీ. ఐశ్వర్యములకు ని ♦ న్ననుసరింపఁగలేదు
ద్రవ్య మిమ్మని వెంటఁ ♦ దగులలేదు

కనక మిమ్మని చాలఁ • గష్టపెట్టఁగలేదు
పల్లకిమ్మని నోటఁ • బలుకలేదు
సొమ్ములిమ్మని నిన్ను • నమ్మి కొల్వఁగలేదు
భూములిమ్మని పేరు • పొగడలేదు
బలము నిమ్మని నిన్ను • బతిమాలగాలేదు
పశుల నిమ్మని పట్టు • పట్టలేదు
తే. నేను గోరిన దొక్కటే • నీలవర్ణ !
చయ్యనను మోక్ష మిచ్చినఁ • జాలు నాకు॥ భూ॥ 5

సీ. మందుడనని నిన్ను • నిందజేసిననేమి
నాదీనతను జూచి • నవ్వనేమి
దూరభావము లేక • తూలనాడిననేమి
ప్రీతిసేయక వంకఁ • బెట్టనేమి
కక్కసంబులు వల్కి • వెక్కిరించిననేమి
తీవ్రకోపముచేతఁ • దిట్టనేమి
మెచ్చుమాటలచేత • నెమ్మిలాడిననేమి
చేరిదాపట గేలి • చేయ నేమి
తే. కల్పవృక్షమువలె నీవు • గల్గ నింక
ప్రజలలక్ష్యంబు నాకేల • పద్మనాభ !॥ భూ॥ 6

సీ. చిత్తశుద్ధిగ నీకు • సేవఁజేసెదఁగాని
పుడమిలో జనుల మె • ప్పులకుఁ గాదు
జన్మపావనతకై • స్మరణఁజేసెదఁగాని
సరివారిలోఁ బ్రతి • ష్ఠలకుఁగాదు
ముక్తికోసరము నే • మ్రొక్కి వేఁడెదఁగాని
దండిభాగ్యము నిమి • త్తంబుగాదు

నిన్నుఁబొగడను విద్య ♦ నేర్చితినేగాని
కుక్షినిండెడు కూటి ♦ కొఱకుఁగాదు
తే. పారమార్థికమునకు నేఁ ♦ బాటుపడితిఁ
గీర్తికి నపేక్షపడలేదు ♦ కృష్ణవర్ణ ‖ భూ‖ 7
సీ. శ్రవణ రంధ్రముల నీ ♦ సత్కథల్ పొగడంగ
లేశ మానందంబు ♦ లేనివాఁడు
పుణ్యవంతులు నిన్నుఁ ♦ బూజసేయఁగఁ జూచి
భావమందుత్సాహ ♦ పడనివాఁడు
భక్తవర్యులు నీ ప్ర ♦ భావముల్ పొగడంగ
దత్పరత్వము లేక ♦ తలఁగువాఁడు
తన చిత్తమందు నీ ♦ ధ్యాన మెన్నడు లేక
కాలమంతయు వృథా ♦ గడపువాఁడు
తే. వసుధలో నెల్ల వ్యర్థుండు ♦ వాఁడె యగును
మఱియుఁజెడుఁగాక యెప్పుడు ♦ మమతనొంది‖ భూ‖ 8
సీ. గౌతమీస్నానానఁ ♦ గడ తేఱుదామంటె
మొనసి చన్నీళ్ళలో ♦ మునుఁగలేను
దీర్ఘయాత్రలచేఁ గృ ♦ తార్థు నౌదామంటె
బడలి నేమంబులే ♦ నడపలేను
దానధర్మముల స ♦ ద్గతిని జెందుదమంటె
ఘనముగానాయొద్ద ♦ ధనములేదు
తపమాచరించి సా ♦ ర్థకత నొందుదమంటె
నిమిషమైన మనస్సు ♦ నిలుపలేను
తే. కష్టములకోర్వ నాచేతఁ ♦ గాదు నిన్ను
స్మరణచేసెద నాయథా ♦ శక్తికొలది‖ భూ‖ 9

సీ. అర్థివాండ్రకు నీక ♦ హానిఁ జేయుటకంటె
దెంపుతో వసనాభి ♦ దినుట మేలు
ఆడుబిడ్డలసొమ్ము ♦ లపహరించుటకంటె
బండఁ గట్టుక నూతఁ ♦ బడుట మేలు
పరులకాంతలఁ బట్టి ♦ బల్మిగూడుటకంటె
బడబాగ్నికీలలఁ ♦ బడుట మేలు
బ్రతుకఁజాలక దొంగ ♦ పనులు సేయుటకంటెఁ
గొంగుతో ముష్టెత్తు ♦ కొనుట మేలు
తే. జలజదళనేత్ర నీభక్త ♦ జనులతోటి
జగడ మాడెడు పనికంటెఁ ♦ జావు మేలు॥ భూ॥ 10

సీ. గార్దభంబున కేల ♦ కస్తూరితిలకంబు
మర్కటంబున కేల ♦ మలయజంబు
శార్దూలమున కేల ♦ శర్కరాపూపంబు
సూకరంబున కేల ♦ చూతఫలము
మార్జాలమున కేల ♦ మల్లెపూవులబంతి
గుడ్లగూబల కేల ♦ కుండలములు
మహిషంబునకును ని ♦ ర్మలవస్త్రమది యేల
బకసంతతికి నేల ♦ పంజరంబు
తే. ద్రోహచింతనఁ జేసెడి ♦ దుర్జనులకు
మధుర మైనట్టి నీనామ ♦ మంత్ర మేల॥ భూ॥ 11

సీ. పసరంబు పంజైనఁ ♦ బసులకాపరితప్పు
ప్రజలు దుర్జనులైనఁ ♦ బ్రభునితప్పు
భార్య గయ్యాళైనఁ ♦ బ్రాణనాథునితప్పు
తనయుఁడు దుష్టైనఁ ♦ దండ్రితప్పు

సైన్యంబుచెదిరిన ♦ సైన్యనాథునితప్పు
కూతురు చెడుగైన ♦ మాతతప్పు
అశ్వంబు చెడుగైన ♦ నారోహకునితప్పు
దంతి దుష్టయిన మా ♦ వంతుతప్పు
తే. ఇట్టితప్పు లెఱుఁగక ♦ యిచ్చవచ్చి
నటులు మెలఁగుదు రిప్పుడీ ♦ యవని జనులు॥ భూ॥ 12

సీ. కోఁతికి జలతారు ♦ కుళ్ళాయి యేటికి
విరజాజిపూదండ ♦ విధవ కేల
ముక్కిడితొత్తుకు ♦ ముత్తెంపు నత్తేల
నద్దమేటికిని జా ♦ త్యంధునకును
మాచకమ్మకు నేల ♦ మౌక్తికహారముల్
క్రూరచిత్తునికి ♦ సద్గోష్ఠులేల
అంకుబోతుకు నేల ♦ బింకపునిష్టలు
వావి యేటికి దుష్ట ♦ వర్తనునకు
తే. మాటనిలుకడ సుంకరి ♦ మోటు కేల
చెవిటివానికి సత్కథా ♦ శ్రవణమేల॥ భూ॥ 13

సీ. మాన్యంబులీయ స ♦ మర్థుఁడొక్కఁడు లేడు
మాన్యముల్ చెఱుప ♦ సమర్థు లంత
ఎండినయూళ్ళగో డెఱిఁగింపఁ ♦ డెవ్వఁడుఁ
బండినయూళ్ళకు ♦ ప్రభువు లంత
యితఁడు పేద యటంచు ♦ నెఱిఁగింపఁ డెవ్వఁడు
గలవారి సిరులెన్నఁ ♦ గలరు చాలఁ
తనయాలిచేష్టల ♦ తప్పెన్నఁ డెవ్వఁడు
బెరకాంత అంకెన్నఁ ♦ బెద్దలంత

తే. యిట్టిదోషుల కధికార ♦ మిచ్చినట్టి
ప్రభులతప్పులటంచును ♦ పలుకవలెను॥ భూ॥ 14

సీ. తల్లిగర్భమునుండి ♦ ధనము తేఁడెవ్వఁడు
వెళ్ళిపోయెడునాఁడు ♦ వెంటరాదు
లక్షాధికారైన ♦ లవణ మన్నమె కాని
మెఱుఁగుబంగారంబు ♦ మ్రింగఁబోఁడు
విత్తమార్జనచేసి ♦ విఱ్ఱవీగుటె కాని
కూడబెట్టినసొమ్ము ♦ తోడరాదు
పొందుగా మఱుఁగైన ♦ భూమిలోపలఁబెట్టి
దానధర్మములేక ♦ దాచిదాఁచి
తే. తుదకు దొంగలకిత్తురో ♦ దొరలకవునొ
తేనె జుంటీగ లియ్యవా ♦ తెరువరులకు॥ భూ॥ 15

సీ. లోకమం దెవఁడైన ♦ లోభిమానవుఁడున్న
భిక్షమర్థికి ♦ జేతఁ బెట్టఁలేడు
తానుబెట్టకయున్నఁ ♦ దగవు పుట్టదుగాని
యొరులు పెట్టఁగఁజూచి ♦ యోర్వలేడు
దాతదగ్గఱఁ జేరి ♦ తనముల్లె చెడినట్లు
జిహ్వతోఁ చాడీలు ♦ జెప్పుచుండు
ఫలమువిఘ్నంబైన ♦ బలుసంతసమునందు
మేలుగల్గినఁ జాల ♦ మిడుకుచుండు
తే. శ్రీరమానాథ యిటువంటి ♦ క్రూరునకును
భిక్షుకులశత్రువని పేరు ♦ పెట్టవచ్చు॥ భూ॥ 16

సీ॥ తనువులోఁ బ్రాణముల్ ♦ తర్లిపోయెడివేళ
నీస్వరూపమును ధ్యా ♦ నించునతడు

నిమిషమాత్రములోన ♦ నిన్నుఁ జేరును గాని
యమునిచేతికిఁజిక్కి ♦ శ్రమలఁబడఁడు
పరమసంతోషాన ♦ భజన సేసెడివారి
పుణ్యమేమనవచ్చు ♦ భోగిశయన
మోక్షము నీదాస ♦ ముఖ్యుల కగుఁగాని
నరక మెక్కడిదయ్య ♦ నళిననేత్ర
తే. కమలనాభునిమహిమలు ♦ గానలేని
తుచ్ఛులకు ముక్తిదొరకుట ♦ దుర్లభంబు॥ భూ॥ 17
సీ. నీలమేఘశ్యామ ♦ నీవె తండ్రివిమాకు
గమలవాసిని మమ్ము ♦ గన్నతల్లి
నీభక్తవరులంత ♦ నిజమైన బాంధవుల్
నీ కటాక్షము మాక ♦ నేక ధనము
నీ కీర్తనలు మాకు ♦ లోక ప్రపంచంబు
నీసహాయము మాకు ♦ నిత్యసుఖము
నీ మంత్రమే మాకు ♦ నిష్కళంకపువిద్య
నీపదధ్యానంబు ♦ నిత్యజపము
తే. తోయజాతాక్ష నీపాద ♦ తులసిదళము
రోగముల కౌషధము బ్రహ్మ ♦ రుద్రవినుత॥ భూ॥ 18
సీ. బ్రతికినన్నాళ్ళు నీ ♦ భజన తప్పను గాని
మరణకాలమునందు ♦ మఱతునేమొ
యావేళ యమదూత ♦ లాగ్రహంబునవచ్చి
ప్రాణముల్ పెకలించి ♦ బట్టునపుడు
కఫవాత పైత్యముల్ ♦ గప్ప గాబరచేతఁ
గంప ముద్భవమంది ♦ కష్టపడుచు

నాజిహ్వతో నిన్ను ♦ నారయణా యంచుఁ
బిలుతునో శక్తిమచేతఁ ♦ బిలువలేనొ
తే. నాఁటికిప్పుడె భక్తి నీ ♦ నామమిదిగొ
తలఁచెదను జెవి నిడవయ్య ♦ ధైర్యముగను॥ భూ॥ 19

సీ. పాంచభౌతికము దు ♦ ర్భరమైన కాయం బి
దెప్పుడో విడుచుట ♦ యెఱుకలేదు
శతవర్షములదాఁక ♦ మితము జెప్పిరిగాని
నమ్మరాదామాట ♦ నెమ్మనమున
బాల్యమందో మంచి ♦ ప్రాయమందో లేక
ముదిమియందో లేక ♦ ముసలియందొ
యూరనో యడవినో ♦ యుదకమధ్యముననో
యెప్పుడో విడచుట ♦ యేక్షణంబొ
తే. మరణమే నిశ్చయము బుద్ధి ♦ మంతుఁడైన
దేహమున్నంతలో మిమ్ముఁ ♦ దెలియవలయు॥ భూ॥ 20

సీ. తల్లిదండ్రులు భార్య ♦ తనయులాప్తులు బావ
మఱఁదు లన్నలు మేన ♦ మామగారు
ఘనముగా బంధువుల్ ♦ గల్గినప్పటికైనఁ
దానుదర్లగ వెంటఁ ♦ దగిలిరారు
యముని దూతలు ప్రాణ ♦ మపహరించుకపోఁగ
మమతతోఁబోరాడి ♦ మాన్పలేరు
బలగమందరు దుఃఖ ♦ పడుటమాత్రమె కాని
యించుక యాయుష్య ♦ మియ్యలేరు
తే. చుట్టములమీఁది భ్రమదీసి ♦ చూరఁజెక్కి
సంతతము మిమ్ముమనమ్మట ♦ సార్థకంబు॥ భూ॥ 21

సీ. ఇభరాజవరద ని ♦ న్నెంత బిల్చినఁగాని
మాఱుపల్కవదేమి ♦ మౌనితనము
మునిజనార్చిత నిన్ను ♦ మ్రొక్కివేఁడిన గాని
కనులఁబడవదేమి ♦ గడుసుఁదనము
చాల దైన్యమునొంది ♦ చాటుచొచ్చినఁగాని
భాగ్యమియ్యవదేమి ♦ ఘాతుకతనము
స్థిరముగా నీపాద సేవఁ ♦ జేసెదనన్న
దొరకఁజాలవదేమి ♦ ధూర్తతనము
తే. మోక్షదాయక యిటువంటి ♦ మూర్ఖజనుని
కష్టపెట్టిన నీకేమి ♦ కడుపునిండు॥ భూ॥ 22
సీ॥ నీమీఁదికీర్తనల్ ♦ నిత్యగానము సేసి
రమ్యమొందింప నా ♦ రదుఁడగాను
సావధానముగ నీ ♦ చరణ పంకజసేవ
సలిపి మెప్పింపఁగ ♦ శబరిగాను
బాల్యమప్పటినుండి ♦ భక్తి నీయందునఁ
గలుగను బ్రహ్లాద ♦ ఘనుఁడగాను
ఘనముగా నీమీఁద ♦ గ్రంథముల్ గల్పించి
వినుతి సేయను వ్యాస ♦ మునినిగాను
తే. సాధుఁడను మూర్ఖమతి మను ♦ ష్యాధముఁడను
హీనుఁడనుజుమి నీవు న ♦ న్నేలుకొనుము॥ భూ॥ 23
సీ. అతిశయంబుగఁ గల్ల ♦ లాడనేర్చితిఁగాని
పాటిగా సత్యముల్ ♦ పలుకనేర
సత్కార్య విఘ్నముల్ ♦ సలుపనేర్చితిగాని
యిష్టమొందఁగ నిర్వ ♦ హింపనేర

నౌకరిసామ్ములకు దోసి ♦ లొగ్గనేర్చితిగాని
చెలువుగా ధర్మంబు ♦ సేయనేర
ధనములియ్యంగ వ ♦ ద్దనఁగ నేర్చితిఁగాని
శీఘ్రమిచ్చెదనట్లు ♦ చెప్పనేరఁ
తే. బంకజాతాక్ష నేనెంతో ♦ పాతకుఁడను
దప్పులన్నియు క్షమియింపు ♦ తండ్రి వీవె॥ భూ॥ 24

సీ. ఉర్విలో నాయుష్య ♦ మున్నపర్యంతంబు
మాయ సంసారంబు ♦ మరిగి నరుఁడు
సకలపాపములైన ♦ సంగ్రహించునుగాని
నిన్నుఁ జేరెడియుక్తి ♦ నేర్వలేడు
తుదకు గాలునియొద్ద ♦ దూతలిద్దఱువచ్చి
గుంజుక చని వారు ♦ కొట్టుచుండ
హింసకోర్వఁగలేక ♦ యేడ్చి గంతులువైచి
దిక్కులేదని నాల్గు ♦ దిశలుఁజూడఁ
తే. దన్ను విడిపింపవచ్చెడు ♦ ధన్యుఁడేఁడి
ముందె నీదాసుఁడయ్యున్న ♦ ముక్తిగలుగు॥ భూ॥ 25

సీ. అధికవిద్యావంతు ♦ లప్రయోజకులైరి
పూర్ణశుంఠలు సభా ♦ పూజ్యులైరి
సత్యవంతులమాట ♦ జనవిరోధంబాయె
వదరుబోతులమాట ♦ వాసికెక్కె
ధర్మవాదనపరుల్ ♦ దారిద్ర్యమొందిరి
పరమలోభులు ధన ♦ ప్రాప్తులైరి
పుణ్యవంతులు రోగ ♦ భూతపీడితులైరి
దుష్టమానవులు వ ♦ ర్ధిష్ణులైరి

తే. పక్షివాహన మావంటి ♦ భిక్షుకులకు
శక్తిలేదాయె నిఁక నీవె ♦ చాటుమాకు॥ భూ॥ 26

సీ. భుజబలంబునఁ బెద్ద ♦ పులుల జంపఁగవచ్చు
పాముకంఠముఁ జంకఁ ♦ బట్టవచ్చు
బ్రహ్మరాక్షసకోట్లఁ ♦ బాఱఁదోలఁగ వచ్చు
మనుజుల రోగముల్ ♦ మాన్పవచ్చు
జిహ్వకిష్టముగాను ♦ జేదుఁ బ్రమింగఁగవచ్చు
బదనుఖడ్గముచేత ♦ నదుమవచ్చు
గష్టమొందుచు ముండ్ల ♦ కంపలోఁ జొరవచ్చుఁ
దిట్టుపోతుల నోళ్ళు ♦ కట్టవచ్చుఁ
తే. బుడమిలో దుష్టులకు జ్ఞాన ♦ బోధ తెలిపి
సజ్జనులఁ జేయలేఁడెంత ♦ చతురుఁడైన॥ భూ॥ 27

సీ. అవనిలోఁ గలయాత్ర ♦ లన్ని చేయఁగవచ్చు
ముఖ్యుఁడై నదులందు ♦ మునఁగవచ్చు
ముక్కుపట్టుక సంధ్య ♦ మొనసి వార్చఁగవచ్చు
దిన్నఁగా జపమాలఁ ద్రిప్పవచ్చు
వేదాల కర్థంబు ♦ విఱిచి చెప్పఁగవచ్చు
శ్రేష్ఠక్రతువులెల్లఁ ♦ జేయవచ్చు
ధనము లక్షలకోట్లు ♦ దానమియ్యఁగ వచ్చు
నైష్ఠికాచారముల్ ♦ నడపవచ్చు
తే. జిత్తమన్యస్థలంబునఁ ♦ జేరకుండ
నీపదాంభోజములయందు ♦ నిలుపరాదు॥ భూ॥ 28

సీ. కర్ణయుగ్మమున నీ కథలు ♦ సోఁకినఁజాలు
పెద్దపోగులజోళ్ళు ♦ పెట్టినట్లు

చేతు లెత్తుచుఁ బూజ ♦ సేయఁగల్గినఁజాలు
దోరయఁగా గడియాలు ♦ దోడిగినట్లు
మొనసి మస్తకముతో ♦ మ్రొక్కఁగల్గినఁజాలు
జెలువమైన తురాయి ♦ చెక్కినట్లు
గళము నొవ్వఁగ నామ ♦ స్మరణగల్గినఁజాలు
వింతగాఁ గంఠీలు ♦ వేసినట్లు
తే. వూని నినుఁగొల్చుటే సర్వ ♦ భూషణంబు
లితర భూషణముల నిచ్ఛ ♦ గింపనేల॥ భూ॥ 29
సీ. భువనరక్షక నిన్ను ♦ బొగడనేరని నోరు
ప్రజకు గోచరమైన ♦ పాడుబొంద
సురవరార్చిత నిన్నుఁ ♦ జూడఁగోరని కనుల్
జలములోపల నెల్లి ♦ సరపుగుండ్లు
శ్రీరమాధిప నీకు ♦ సేవచేయని మేను
కూలి కమ్మరివాని ♦ కొలిమితిత్తి
వేడ్కతో నీకథల్ ♦ విననికర్ణములైన
గఠినశిలాదులఁ ♦ గలుగుతొలులు
తే. పద్మలోచన నీమీఁద ♦ భక్తిలేని
మానవుఁడు రెండుపాదాల ♦ మహిషమయ్య॥ భూ॥ 30
సీ. అతివిద్య నేర్చుట ♦ యన్నవస్త్రములకే
పశుల నార్జించుట ♦ పాలకొఱకె
సతిని బెండ్లాడుట ♦ సంసార సుఖముకే
సుతులఁ బోషించుట ♦ గతులకొఱకె
సైన్యముల్ గూర్చుట ♦ శత్రువు భయముకే
సామునేర్చుట లెల్లఁ ♦ జావుకొఱకె

దానమిచ్చుటయు ముం ♦ దటి సంచితమునకే
ఘనముగాఁ జదువుట ♦ కడుపుకొఱకె
తే. యితరకామంబుఁగోరక ♦ సతతముగను
భక్తి నీయందు నిలుపుట ♦ ముక్తికొఱకె॥ భూ॥ 31

సీ. ధరణిలో వేయేండ్లు ♦ తనువు నిల్వఁగబోదు
ధనమెప్పటికి శాశ్వ ♦ తంబుగాదు
దారసుతాదులు ♦ తనవెంట రాలేరు
భృత్యులు మృతిని ద ♦ ప్పింపలేరు
బంధుజాలము తన్ను ♦ బ్రతికించుకోలేరు
బలపరాక్రమ మేమి ♦ పనికిరాదు
ఘనమైన సకలభా ♦ గ్యంబెంతఁ గల్గియు
గోచిమాత్రంబైనఁ ♦ గొనుచుఁబోఁడు
తే. వెఱ్ఱికూరకూల భ్రమలన్ని ♦ విడిచి నిన్ను
భజనఁ జేసెడివారికిఁ ♦ బరమ సుఖము॥ భూ॥ 32

సీ. నరసింహ నాకు దు ♦ ర్ణయములే మెండాయె
సుగుణ మొక్కటిలేదు ♦ చూడఁజనిన
యన్యకాంతలమీఁద ♦ నాశమానఁగలేను
ఒగుల క్షేమముచూచి ♦ యోర్వలేను
ఇటువంటి దుర్బుద్ధు ♦ లిన్ని నాకున్నవి
నేను జేసెడివన్ని ♦ నీచకృతులు
నావంటి పాపిష్ఠి ♦ నరుని భూలోకాన
బుట్టజేసితివేల ♦ భోగిశయన
తే. అబ్జదళనేత్ర నాతండ్రి ♦ వైనఫలము
నేరములు గాచి రక్షింపు ♦ నీవెదిక్కు॥ భూ॥ 33

సీ. ధీరతఁ బరుల నిం ♦ దింపనేర్చితిఁగాని
తిన్నగా నిన్నుఁ బ్రస్తు ♦ తింపనైతిఁ
బారుగు కామినులందు ♦ బుద్ధినిల్పితిగాని
నిన్ను సంతతము ధ్యా ♦ నింపనైతిఁ
బెరికి ముచ్చటలైన ♦ మురిసి వింటినిగాని
యొంచి నీకథ లాల ♦ కించనైతి
గౌతుకంబునఁ బాత ♦ కము గడించితిఁ గాని
హెచ్చుపుణ్యము సంగ్ర ♦ హింపనైతి
తే. నవనిలో నేను జన్మించి ♦ నందు కేమి
సార్థకము గానరాదాయె ♦ స్వల్పమైన॥ భూ॥ 34
సీ. అంత్యకాలమునందు ♦ నాయాసమున నిన్ను
దలఁతునో దలఁపనో ♦ తలఁతు నిపుడె
నరసింహ నరసింహ ♦ నరసింహ లక్ష్మీశ
దానవాంతక కోటి ♦ భానుతేజ
గోవింద గోవింద ♦ గోవింద సర్వేశ
పన్నగాధిపశాయి ♦ పద్మనాభ
మధువైరి మధువైరి ♦ మధువైరి లోకేశ
నీలమేఘశరీర ♦ నిగమ వినుత
తే. ఈవిధంబున నీనామ ♦ మిష్టముగను
భజన సేయుచునుందు నా ♦ భావమందు॥ భూ॥ 35
సీ. ఆయురారోగ్య పు ♦ త్రార్థసంపద లన్ని
గలుగఁజేసెడి భార ♦ కర్తవీవె
చదువు లెస్సఁగ నేర్చి ♦ సభలో గరిష్ఠాధి
కార మొందించెడి ♦ ఘనుఁడవీవె

నడక మంచిదిపెట్టి ♦ నరులు మెచ్చెదునట్టి
పేరు రప్పించెడి ♦ పెద్దవీవె
బలువైన వైరాగ్య ♦ భక్తిజ్ఞానమునిచ్చి
ముక్తిబొందించెదు ♦ మూర్తివీవె
తే. అవనిలో మానవుల కన్ని ♦ యానలిచ్చి
వ్యర్థులనుజేసి తెలిపెడి ♦ వాడవీవె॥ భూ॥ 36

సీ. కాయమెంతభయానఁ ♦ గాపాడినంగాని
ధాత్రిలో నదిచూడ ♦ దక్కబోదు
ఏవేళ నేరోగ ♦ మేమరించునొ సత్వ
మొందఁగజేయు మే ♦ చందమునను
ఔషధములుమంచి ♦ ననుభవించినగాని
కర్మక్షీణంబైన ♦ గానివిడదు
కోటివైద్యులు గుంపు ♦ గూడివచ్చినగాని
మరణమిచ్చెదు వ్యాధి ♦ మాన్పలేరు
తే. జీవుని ప్రయాణకాలంబు ♦ సిద్ధమైన
నిలుచునా దేహ మిందొక్క ♦ నిమిషమైన॥ భూ॥ 37

సీ. జందెమింపుగవేసి ♦ సంధ్య వార్చిననేమి
బ్రహ్మమందక కాఁడు ♦ బ్రాహ్మణుండు
తిరుమణి శ్రీచూర్ణ ♦ గురురేఖలిడినను
విష్ణునొందక కాఁడు ♦ వైష్ణవుండు
బూదిని నుదుటను ♦ బూసికొనిననేమి
శంభునొందక కాఁడు ♦ శైవజనుఁడు
కాషాయవస్త్రాలు ♦ గట్టి కప్పిననేమి
యాశపోవక కాఁడు ♦ యతివరుండు

తే. ఇట్టి లౌకికవేషాలు ♦ గట్టుకొనిన
గురుని జెందక సన్ముక్తి ♦ దొరకబోదు॥ భూ॥ 38

సీ. నరసింహ నేనిన్ను ♦ నమ్మినందుకుఁ జాల
నెనరు నాయందుంచు ♦ నెమ్మనమున
నన్నివస్తువులు ని ♦ న్నడిగి వేసటపుట్టు
నింక నైనఁ గటాక్ష ♦ మియ్యవయ్య
సంతసంబున నన్ను ♦ స్వర్గమందేయుంచు
భూమియందేయుంచు ♦ భోగిశయన
నయముగా వైకుంఠ ♦ నగరమందేయుంచు
నరకమంఁదేయుంచు ♦ నళిననాభ

తే. ఎచట నన్నుంచినంగాని ♦ యెప్పుడు నిన్ను
మఱచిపోకుండ నీనామ ♦ స్మరణనొసగు॥ భూ॥ 39

సీ. దేహమున్నవఱకు ♦ మోహసాగరమందు
మునుగుచుందురు శుద్ధ ♦ మూఢజనులు
సలిలమైశ్వర్యముల్ ♦ శాశ్వతంబనుకొని
షడ్భ్రమలను మానఁ ♦ జాలరెవరు
సర్వకాలము మాయ ♦ సంసార బద్ధులై
గురుని కారుణ్యంబు ♦ గోరుకొనరు
జ్ఞాన భక్తి విరక్తు ♦ లైన పెద్దలుఁజూచి
నిందఁజేయక తాము ♦ నిలువలేరు

తే. మత్తులైనట్టి దుర్జాతి ♦ మనుజులెల్ల
నిన్నుఁగనలేరు మొదటికే ♦ నీరజాక్ష॥ భూ॥ 40

సీ. ఇలలోన నేజన్మ ♦ మెత్తినప్పటినుండి
బలు గడించితినయ్య ♦ పాతకములు

తెలిసి చేసితి కొన్ని ♦ దెలియజాలకచేసి
బాధ నొందితినయ్య ♦ పద్మనాభ
అనుభవించెడు నప్పు ♦ డతిప్రయాసంబుచుఁ
బ్రజలు చెప్పఁగఁజాల ♦ భయముగలిగె
నెగిరిపోవుటకు నై ♦ యే యుపాయంబైనఁ
జేసి చూతమటన్నఁ ♦ జేతకాదు
తే. సూర్య శశినేత్ర నీచాటుఁ ♦ జొచ్చినాఁడ
కలుషములుదుంచి నన్నేలు ♦ కష్టమనక॥ భూ॥ 41
సీ. తాపసార్చిత నేను ♦ బాపకర్ముఁడటంచు
నాకు వంకలఁబెట్టఁ ♦ బోకుజుమ్మి
నాఁటికి శిక్షలు ♦ నాకు జేయుటకంటె
నేఁడు సేయుము నీవు ♦ నేస్తమనక
అతిభయంకరులైన ♦ యమదూతలకు నన్ను
నొప్పగింపకుమయ్య ♦ యురగశయన
నీదాసులను బట్టి ♦ నీవు దండింపంగ
వద్దువద్దనరెంత ♦ పెద్దలైన
తే. దండ్రి నీవు పరపీడఁ ♦ దగులజేయ
వాసిగల పేరు కపకీర్తి ♦ వచ్చునయ్య॥ భూ॥ 42
సీ. ధరణిలోపల నేను ♦ తల్లిగర్భమునందు
బుట్టినప్పటినుండి ♦ పుణ్యమెఱుఁగ
నేకాదశీవ్రతం ♦ బెన్నఁడుండగలేదు
తీర్థయాత్రలకైనఁ ♦ దిరుగలేదు
పారమార్థికమైన ♦ పనులు సేయఁగలేదు
భిక్షమొక్కనికైనఁ ♦ బెట్టలేదు

జ్ఞానవంతులకైనఁ ♦ బూని మ్రొక్కఁగలేదు
ఇతరదానములైనఁ ♦ నియ్యలేదు
తే. నళిన దళనేత్ర నిన్ను ♦ నే నమ్మినాను
జేరి రక్షింపవే నన్ను ♦ శీఘ్రముగను భూ॥
సీ. అడవిపక్షుల కెవ్వఁ ♦ డాహార మిచ్చెను
మృగజాతి కెవ్వఁడు ♦ మేఁతబెట్టె
వనచరాదులకు భో ♦ జన మెవ్వడిప్పించెఁ
జెట్లకెవ్వడు నీళ్ళు ♦ చేఁది పోసె
స్త్రీలగర్భంబున ♦ శిశువు నెవ్వఁడు పెంచె
ఫణుల కెవ్వఁడు పోసెఁ ♦ బరఁగ బాలు
మధుపాళి కెవ్వఁడు ♦ మకరంద మొనరించె
బసుల కెవ్వఁడొసంగె ♦ బచ్చిపూరి
తే. జీవ కోట్లను బోషింప ♦ నీవె కాని
వేఱె యొక దాత లేడయ్య ♦ వెదకిచూడ॥ భూ॥ 44
సీ. దనుజారి నావంటి ♦ దాసజాలము నీకు
కోటి సంఖ్య గలారు ♦ కొదువలేదు
బంట్లనందడి వల్ల ♦ బహుపరాకై నన్ను
మఱచిపోకుము భాగ్య ♦ మహిమచేత
దండిగా భృత్యులు ♦ దగిలి నీకుండఁగ
బక్కబంటే పాటి ♦ పనికి నగును
నీవు మెచ్చెడి పనుల్ ♦ నేను జేయఁగ లేక
యింత వృథాజన్మ ♦ మెత్తినాను
తే. భూజనులలో నే నపరి ♦ యోజకుఁడను
గనుక నీ సత్కటాక్షంబు ♦ గలుఁగజేయు॥ భూ॥ 45

సీ. కమలలోచన నన్నుఁ ♦ గన్న తండ్రివిగాన
నిన్ను నేమఱకుంటి ♦ నేఁడువిడక
యుదరపోషణకునై ♦ యొకరి నే నాశింప
నేర నాకన్నంబు ♦ నీవునడపు
పెట్టలేనంటివా ♦ పిన్న పెద్దలలోనఁ
దగవు కిప్పుడు దీయఁ ♦ దలచినాను
ధనము భారంబయినఁ ♦ దలకిరీటము లమ్మి
కుండలంబులు పైడి ♦ గొలుసు లమ్మి
తే. కొనకు నీశంఖచక్రముల్ ♦ కుదువబెట్టి
గ్రాసము నొసంగి పోషించు ♦ కపటముడిగి॥ భూ॥ 46

సీ. కువలయశ్యామ నీ ♦ కొలువు చేసిననాకు
జీత మొందుకు ముట్టఁ ♦ జెప్పవైతి
మంచిమాటలచేతఁ ♦ గొంచె మియ్యగలేదు
కలహమా నికఁ జుమ్మి ♦ ఖండితముగ
నీవు సాధువు గాన ♦ నింత పర్యంతంబు
చనువుచే నిన్నాళ్ళు ♦ జరుపవలసె
నిఁక నే సహింప నీ ♦ విపుడు నన్నేమైన
శిక్షచేసినఁ జేయు ♦ సిద్ధమయితి
తే. నేడు కరుణింపకుంటివా ♦ నిశ్చయముగఁ
దెగఁబడితిఁజూడు నీతోడ ♦ జగడమునకు॥ భూ॥ 47

సీ. హరినీకుఁ బర్యంత ♦ మయిన శేషుఁడు చాలఁ
బవనము భక్షించి ♦ బ్రతుకుచుండు
ననువుగా నీకు వా ♦ హనమైన ఖగరాజు
గొప్పపామును నోటఁ ♦ గొఱుకుచుండు

నదిగాక నీభార్య ♦ యయిన లక్ష్మీదేవి
దినము పేరంటంబు ♦ దిరుగుచుండు
నిన్ను భక్తులుపిల్చి ♦ నిత్యపూజలుచేసి
ప్రేమఁ బక్వాన్నముల్ ♦ పెట్టుచుంద్రు
తే. స్వస్థముగ నీకు గ్రాసము ♦ జరుగుచుండఁ
గాసు నీచేతిదొకటైన ♦ గాదు వ్యయము॥ భూ॥ 48

సీ. పుండరీకాక్ష నారెండు ♦ కన్నులనిండ
నిన్నుఁజూచెడిభాగ్య ♦ మెన్నడయ్య
వాసిగా నామనో ♦ వాంఛ దీరెడునట్లు
సొగసుగా నీరూపు ♦ జూపవయ్య
పాపకర్మనికంబె ♦ బడకపోవుదమంచుఁ
బరుషమైనప్రతిజ్ఞ ♦ బట్టినావ
వసుధలోఁ బతితపా ♦ వనుఁడ వీవంచునేఁ
బుణ్యవంతులనోట ♦ బొగడవింటి
తే. నేమిటికి విస్తరించె నీ ♦ కింతకీర్తి
ద్రోహినైనను నాకీవు ♦ దొరకరాదె॥ భూ॥ 49

సీ. పచ్చిచర్మపుదిత్తి ♦ పసలేదు దేహంబు
లోపలనంతట ♦ రోయరోత
నరములుశల్యముల్ ♦ నవరంధ్రములు రక్త
మాసంబుకండలు ♦ మైలతిత్తి
బలువైనయెముక ♦ వానలకోర్వదెంతైన
దాళలే దాఁకలి ♦ దాహములకు
సకలరోగములకు ♦ సంస్థానమయియుండు
నిలువ దస్థిరమైన ♦ నీటిబుగ్గ

తే॥ బొందిలోనుండు ప్రాణముల్ ♦ బోయినంతఁ
గాటికేగాని కొఱగాదు ♦ గవ్వకైన॥ భూ॥ 50

సీ. పలురోగములకు నీ ♦ పాదతీర్థమెకాని
వలపుమందులనాకు ♦ వలదు వలదు
చెలిమి సేయుచు నీకు ♦ సేవఁజేసెదఁగాని
నీదాసకోటిలో ♦ నిలుపవయ్య
గ్రహభయంబునకుఁ జ ♦ క్రిమ దలంచెదఁగాని
ఘోరరక్షలుగట్ట ♦ గోరనయ్య
పాము కాటున నిన్ను ♦ భజనఁ జేసెదఁగాని
దానిమంత్రము నేను ♦ దలపనయ్య
తే॥. దొఱకితివి నాకు దండివై ♦ ద్యుడవునీవు
వేయి కష్టాలువచ్చిన ♦ వెరవనయ్య॥ భూ॥ 51

సీ. కూటికోసరము నేఁ ♦ గొఱగాని జనులచే
బలుగద్దరింపులు ♦ పడఁగవలసె
దారసుతభ్రమ ♦ దగిలి యుండఁగఁగదా
దేశ దేశములెల్ల ♦ దిరుగవలసెఁ
బెనుదరిద్రత పైని ♦ బెనఁగి యుండఁగఁగదా
చేరి నీచులసేవ ♦ చేయవలసె
నభిమానములు మది ♦ నంటియుండఁగఁగదా
పరులజూఁచిన భీతి ♦ పడఁగవలసె
తే. నిటులసంసార వారధి ♦ నీదలేక
వేయివిధముల నిన్ను నే ♦ వేడుకొంటి॥ భూ॥ 52

సీ. సాధుసజ్జనులతో ♦ జగడమాడినఁ గీడు
కవులతో వైరంబుఁ ♦ గాంచఁగీడు

పరమ దీనులఁ జిక్కి ♦ బట్టి కొట్టినఁ గీడు
బిక్షుకులను దుఃఖ ♦ పెట్టఁ గీడు
నిఱుపేదలనుజూచి ♦ నింద జేసినఁ గీడు
పుణ్యావంతులఁ దిట్ట ♦ బొసగు గీడు
సద్భక్తులను దిర ♦ స్కారమాడినఁ గీడు
గురుని ద్రవ్యము దోఁచు ♦ కొనినఁ గీడు
తే. దుష్ట కార్యము లొనరించు ♦ దుర్జనులకు
ఘనతరంబైన నరకంబు ♦ గట్టిముల్లె॥ భూ॥ 53
సీ. పరుల ద్రవ్యముమీఁద ♦ భ్రాంతినొందినవాఁడు
పరకాంతల నపేక్ష ♦ పడెడువాఁడు
అర్థుల విత్తంబు ♦ లపహరించెడి వాఁడు
దానమియ్యంగ వ ♦ ద్దనెడువాఁడు
సభలలోపలనిల్చి ♦ చాడిచెప్పెడివాఁడు
పక్షపు సాక్ష్యంబు ♦ పలుకువాఁడు
విష్ణుదాసులఁజూచి ♦ వెక్కిరించెడివాఁడు
ధర్మసాధులఁ దిట్ట ♦ దలఁచువాఁడు
తే. ప్రజల జంతుల హింసించు ♦ పాతకుండు
కాలకింకర గదలచేఁ ♦ గష్టమొందు॥ భూ॥ 54
సీ. నరసింహ నాతండ్రి ♦ నన్నేలు నన్నేలు
కామితార్థములిచ్చి ♦ కావు కావు
దైత్యసంహార చాల ♦ దయయుంచు దయయుంచు
దీనపోషక నీవె ♦ దిక్కు దిక్కు
రత్నభూషితవక్ష ♦ రక్షించు రక్షించు
భువనరక్షక నన్నుఁ ♦ బ్రోవు ప్రోవు

మారకోటి స్వరూప ♦ మన్నించు మన్నించు
బద్మలోచన చేయి ♦ పట్టు పట్టు
తే. సురవినుత నేను నీచాటుఁ ♦ జొచ్చినాను
నా మొఱాలించి కడ తేర్పు ♦ నాగశయన॥ భూ॥ 55

సీ. నీభ క్తులను గనుల ♦ నిండజూచియు రెండు
చేతుల జోహారు ♦ సేయువాఁడు
నేర్పుతో నెవరైన ♦ నీ కథల్ చెప్పంగ
వినయమందుచుఁ జాల ♦ వినెడువాఁడు
తనగృహంబునకు నీ ♦ దాసులురాఁ జూచి
పీటపైఁ గూర్చుండ ♦ బెట్టువాఁడు
నీసేవకుల జాతి ♦ నీతులెన్నక చాల
దాసోహమని చేరఁ ♦ దలఁచువాఁడు
తే. పరమ భ క్తుఁడు ధన్యుండు ♦ భాను తేజ
వానిఁ గనుఁగొన్నఁ బుణ్యంబు ♦ వసుధలోన॥ భూ॥ 56

సీ. పంజరంబునఁ గాకి ♦ పక్షి నుంచిన లెస్స
పలుకునే వింతైన ♦ చిలుకవలెను
గార్ధభంబును దెచ్చి ♦ కళ్యెమింపుగ వేయఁ
దిరుగునే గుఱ్ఱంబు ♦ తీరుగాను
ఎనుపపోతును మావ ♦ టీఁడు శిక్షించిన
నడచునే మదవార ♦ ణంబు వలెను
బెద్దపిట్టను మేఁత ♦ బెట్టి పెంచినఁ గ్రొవ్వి
సాగునే వేఁటాడు ♦ డేగవలెను
తే. కుజనులను దెచ్చి నీసేవ ♦ కొఱకుఁ బెట్ట
వాంఛతోఁ జేతురే భ క్త ♦ వరులవలెను॥ భూ॥ 57

సీ. నిగమాది శాస్త్రముల్ ♦ నేర్చిన ద్విజుఁడైన
యజ్ఞకర్తకు సోమ ♦ యాజియయిన
ధరణిలోపల ప్రభా ♦ తస్నానపరుఁడైన
నిత్యసత్కర్మాది ♦ నిరతుఁడయిన
నుపవాసనియమంబు ♦ నొందుసజ్జనుఁడయిన
గావివస్త్రము గట్టు ♦ ఘనుఁడునైన
దండి షోడశమహా ♦ దానపరుండయిన
సకలయాత్రలు సల్పు ♦ సరసుఁడయిన
తే. గర్వమునఁ గష్టపడి నిన్నుఁ ♦ గానకున్న
మోక్షసామ్రాజ్య మొందఁడు ♦ మోహనాంగ! భూ॥ 58

సీ. పక్షివాహన నేను ♦ బ్రతికినన్ని దినాలు
కొండెగాండ్రను గూడి ♦ కుమతినైతి
నన్నవస్త్రము లిచ్చి ♦ యాదరింపుము నన్నుఁ
గన్నతండ్రివి నీవె ♦ కమలనాభ
మరణమయ్యెడినాఁడు ♦ మమతతో నీయొద్ద
బంట్లఁ దోలుము ముందు ♦ బ్రహ్మజనక
యినజభటావళి ♦ యీడిచికొని పోక
కరుణతోఁ నాయొద్ద ♦ గావలుంచు
తే. కొనకు నీసన్నిధికిఁ బిల్చు ♦ కొనియు నీకు
సేవకునిఁ జేసికొనవయ్య ♦ శేషశయన॥ భూ॥ 59

సీ. నీకు దాసుఁడనంటి ♦ నిన్ను నమ్మకయుంటిఁ
గాన నాపై నేఁడు ♦ కరుణఁజూడు
దోసి లొగ్గితి నీకు ♦ ద్రోహ మెన్నఁగఁబోకు
పద్మలోచన నేను ♦ బరుఁడగాను

భక్తినీపై నూని ♦ భజనఁ జేసెదఁ గాని
వరుల వేఁడను జుమ్మి ♦ వరము లిమ్మి
దండిదాతవు నీవు ♦ తడవు సేయక కావు
ఘోరపాతక రాసి ♦ గొట్టివేసి
తే. శీఘ్రముగఁ గోర్కులీడేర్చు ♦ చింత దీర్చు
నిరతముగ నన్నుఁ బోషించు ♦ నెనరునుంచు॥ భూ॥ 60

సీ. విద్య నేర్చితి నంచు ♦ విఱ్ఱవీఁగగ లేదు
భాగ్యవంతుఁడ నంచు ♦ బలుకలేదు
ద్రవ్యవంతుఁడనంచు దఱచు ♦ నిక్కఁగలేదు
నిరత దానములైన ♦ నెంపలేదు
పుత్రవంతుఁడ నంచుఁ బొగడు ♦ చుండగఁ లేదు
భృత్యవంతుఁడ నంచుఁ ♦ బొగడలేదు
శౌర్యవంతుఁడ నంచుఁ ♦ సంతసింపగ లేదు
కార్యవంతుఁడ నంచుఁ ♦ గడవలేదు
తే. నలుగురికి మెప్పుగానయిన ♦ నడవలేదు
నళినదళనేత్ర నిన్ను నే ♦ నమ్మినాను॥ భూ॥ 61

సీ. అతిలోభులను భిక్ష ♦ యడుగబోవుట రోఁత
తనద్రవ్య మొకరింట ♦ దాచరోఁత
గుణహీనుఁడగువాని ♦ కొలువు గొల్చుట రోఁత
యొరుల పంచల క్రింద ♦ నుంట రోఁత
భాగ్యవంతునితోడఁ ♦ బంతమాడుట రోఁత
గుఱిలేని బంధులఁ ♦ గూడ రోఁత
నాదాయములు లేక ♦ యప్పుదీయుట రోఁత
జారచోరులఁ గూడి ♦ చనుట రోఁత

తే. యాదిలక్ష్మీశ నీబంటు ♦ నయితినయ్య
యింక నెడబాయ జన్మంబు ♦ నెత్తరోఁత॥ భూ॥ 62

సీ. వెట్టివానికేల ♦ వేదాక్షరంబులు
మోటువానికి మంచి ♦ పాటలేల
పసులకాఁపరికేల ♦ పరతత్త్వబోధలు
విటకానికేలపో ♦ విష్ణుకథలు
వదరు శుంఠలకేల ♦ వ్రాతపుస్తకములు
తిరుగు ద్రిమ్మరికేల ♦ దేవపూజ
ద్రవ్యలోభికి నేల ♦ దాతృత్వగుణములు
దొంగబంటుకు మంచి ♦ సంగతేల
తే. క్రూరజనులకు నీమీఁద ♦ గోరికేల
ద్రోహిపాపాత్మునకు దయా ♦ దుఃఖమేల॥ భూ॥ 63

సీ. నాతండ్రి నాదాత ♦ నాయిష్టదైవమా
నన్ను మన్ననసేయు ♦ నారసింహ
దయయుంచు నామీఁద ♦ దప్పులన్నిక్షమించు
నిగమగోచర నాకు ♦ నీవెదిక్కు
నే దురాత్ముఁడనంచు ♦ నీమనంబున గోప
గింపఁబోకుము స్వామి ♦ యెంతకైన
ముక్తిదాయక నీకు ♦ మ్రొక్కెనందుకు నన్ను
గరుణించి రక్షించు ♦ కమలనాభ
తే. దండిదొరవంచు నీవెంటఁ ♦ దగిలినాను
నేడు ప్రత్యక్షమై నన్ను ♦ నిర్వహింపు॥ భూ॥ 64

సీ. వేమాఱు నీకథల్ ♦ వినుచునుండెడు వాఁడు
పరుల ముచ్చటమీఁద ♦ భ్రాంతిపడఁడు

అగణితంబుగఁ నిన్నుఁ ♦ బొగడనేర్చినవాఁడు
చెడ్డమాటను నోట ♦ జెప్పబోఁడు
ఆసక్తిచేత ని ♦ న్ననుసరించెడివాఁడు
ధనమదాంధుల వెంట ♦ దగులబోఁడు
సంతసంబున నిన్ను ♦ స్మరణఁజేసెడివాఁడు
చెలఁగి నీచులపేరు ♦ దలఁపబోఁడు
తే. నిన్ను నమ్మిన భక్తుండు ♦ నిశ్చయముగ
గోరి చిల్లరదైవముల్ ♦ గొల్వఁబోఁడు॥ భూ॥ 65
సీ. నేనెంత వేఁడిన ♦ నీకేలదయరాదు
పలుమాఱుఁ బిలిచినఁ ♦ బలుకవేమి
పలికిన నీకున్న ♦ పదవేమి బోవు నీ
మోమైన బొడసూప ♦ వేమినాకు
శరణుఁజొచ్చినవాని ♦ సవరింపవలెఁగాక
పరిహరించుట నీకు ♦ బిరుదుగాదు
నీదాసులనునీవు ♦ నిర్వహింపక యున్న
బరులెవ్వఱగుదురు ♦ పంకజాక్ష !
తే. దాత దైవంబు తల్లియుఁ ♦ దండ్రివీవె
నమ్మియున్నాను నీపాద ♦ నళినములను॥ భూ॥ 66
సీ. వేదముల్ చదివెడు ♦ విప్రవర్యుండయిన
రణము సాధించెడు ♦ రాజులైన
వర్తక కృషికుఁడౌ ♦ వైశ్యముఖ్యుండయినఁ
బరిచరించెడి శూద్ర ♦ వర్యుఁడయిన
మెచ్చు ఖడ్గముఁబట్టి ♦ మెఱయుమ్లేచ్ఛుండయినఁ
బ్రజల కక్కఱబడు ♦ రజకుఁడయినఁ

జన్మమెత్తిన హీన ♦ చండాల నరుఁడైన
నీమహీతలమందు ♦ నెవ్వఁడయిన

తే. నిన్నుఁగొని యాడుచుండెనా ♦ నిశ్చయముగ
వాఁడు మోక్షాధికారి యౌ ♦ వసుధలోన॥ భూ॥ 67

సీ. సకలవిద్యలు నేర్చి ♦ సభజయింపగవచ్చు
శూరుడై రణమందుఁ ♦ బోరవచ్చు
రాజరాజై పుట్టి ♦ రాజ్యమేలఁగవచ్చు
హేమ గోదానంబు ♦ లియ్యవచ్చు
గగనమందున్న చు ♦ క్కల నెంచుకొనవచ్చు
జీవరాసులపేళ్ళు ♦ చెప్పవచ్చు
నష్టాంగయోగము ♦ లభ్యసింపగఁవచ్చు
మేకరీతిగ నాకు ♦ మెసవవచ్చు

తే. దామరసగర్భ హరపురం ♦ దరులకైన
నిన్ను వర్ణింప దరమౌనె ♦ నీరజాక్ష !॥ భూ॥ 68

సీ. నరసింహ నీవంటి ♦ దొరను సంపాదించి
కుమతి మానవుల నేఁ ♦ గొల్వఁజాల
నెక్కునైశ్వర్యంబు ♦ లియ్యలేకున్నను
బొట్టకు మాత్రము ♦ పోయరాదె
ఘనముగాదిది నీకు కలవునఁ ♦ బోషింపఁ
గష్టమెంతటి స్వల్ప ♦ కార్యమయ్య
పెట్టఁజాలక యేల ♦ భిక్షమెత్తించెద
నన్ను బీదను జేసి ♦ నావదేమి

తే. అమల కమలాక్ష నేనిట్లు ♦ శ్రమపడంగ
గన్నులకుఁ బండువై నీకుఁ ♦ గానబడునె॥ భూ॥ 69

సీ. వనజాతనాభ నీ ♦ వంకఁజేరితి నేను
గట్టిగా ననుఁగావు ♦ కావుమనుచు
వచ్చినందుకు వేగ ♦ వరము లియ్యక కాని
లేవఁబోయిన నిన్ను ♦ లేవనియ్యఁ
కూర్చుండఁబెట్టి నీ ♦ కొంగు గట్టిగఁ బట్టి
పుచ్చుకొందును జూడు ♦ భోగిశయన
యీవేళ నీకడ్డ ♦ మెవరువచ్చినఁగాని
వారికైననులొంగి ♦ వదలఁబోను
తే. గోపగాఁడనునీవు నా ♦ గుణము దెలిసి
యప్పుడే నన్ను రక్షించి ♦ యేలుకొమ్ము॥ భూ॥ 70

సీ. ప్రహ్లాదుఁ డేపాటి ♦ పైడికానుకలిచ్చె
మదగజం బెన్నిచ్చె ♦ మౌక్తికములు
నారదుం డెన్నిచ్చె ♦ నగలు రత్నంబు ల
హల్య నీకే యగ్ర ♦ హారమిచ్చె
నుదుత నీకేపాటి ♦ యూడిగంబులు చేసె
ఘనవిభీషణుఁడేమి ♦ కట్నమిచ్చెఁ
బంచపాండవులేమి ♦ లంచమిచ్చిరి నీకు
ద్రౌపది నీకెంత ♦ ద్రవ్యమిచ్చె
తే. నీకు వీరందఱయినట్లు ♦ నేనుగాన
యొందుకని నన్ను రక్షింప ♦ విందువదన?॥ భూ॥ 71

సీ. వాంఛతో బలిచక్ర ♦ వర్తిదగ్గఱఁచేరి
భిక్షమెత్తితివేల ♦ బిడియపడక
యడవిలో శబరి తియ్యని ♦ ఫలాలందియ్య
జేతులొగ్గితివేల ♦ సిగ్గుపడక

వేడ్కతో వేవేగ ♦ విదురునింటికి నేఁగి
విందుగొంటివ దేమి ♦ వెలితిపడక
నడుకు లల్పము కుచే ♦ లుఁడు గణించుక దేర
బొక్కసాగితి వేల ♦ లెక్కగొనక
తే. భక్తులకు నీవు పెట్టుట ♦ భాగ్యమౌను
వారి నాసించితివి తిండి ♦ వాఁడవగుచు॥ భూ॥ 72
సీ. స్తంభమందుదయించి ♦ దానవేంద్రునిఁదుంచి
కరుణతోఁ బ్రహ్లాదుఁ ♦ గాచినావు
మకరిచేఁజిక్కి సా ♦ మజము దుఃఖింపంగ
కృపయుంచి వేగ ర ♦ క్షించినావు
శరణంచు నా విభీ ♦ షణుఁడు నీచాటున
వచ్చినప్పుడె లంక ♦ నిచ్చినావు
ఆకుచేలుఁడు చేరె ♦ డడుకు లర్పించిన
బహుసంపదలనిచ్చి ♦ పంపినావు
తే. వారివలె నన్నుఁబోషింప ♦ వశముగాదె
అంత వలపక్షమేల శ్రీ ♦ కాంతనీకు॥ భూ॥ 73
సీ. వ్యాసుఁడేకులమందు ♦ వాసిగాజన్మించె
విదురుఁడేకులమందు ♦ వృద్ధిబొందె
గర్గుడేఁకులమందు ♦ ఘనముగా వర్ధిల్లె
నావషిష్ఠుం డెట ♦ నవతరించె
నింపుగా వాల్మీకుఁ ♦ డేకులంబున హెచ్చె
గుహుఁడను పుణ్యుఁ డే ♦ కులమువాడు
శ్రీశుకుఁ డెచ్చటఁ ♦ జెలఁగి జన్మించెను
శబరి యేకులమందు ♦ జన్మమొందె

తే. నేకులంబున వీరంద ♦ ఱెచ్చినారు
నీకృపాపాత్రులకు జాతి ♦ నీతులేల॥ భూ॥ 74

సీ. వసుధాస్థలంబునఁ ♦ వర్ణహీనుఁడుగాని
బహుళ దురాచార ♦ పరుఁడుగాని
తడసి కాసియ్యని ♦ ధర్మశూన్యుఁడుగాని
చదువనేరని మూఢ ♦ జనుఁడుగాని
సకలమానవులు మె ♦ చ్చని కృతఘ్నుఁడుగాని
చూడ సొంపునులేని ♦ శుంఠగాని
యప్రతిష్ఠలకు లో ♦ నైన దీనుఁడుగాని
మొదటి కేమెఱుఁగని ♦ మోటుగాని

తే. ప్రతిదినము నీదు భజనచేఁ ♦ బరగునట్టి
వాని కేవంక లేదయ్య ♦ వచ్చుముక్తి॥ భూ॥ 75

సీ. ఇభకుంభములమీఁది ♦ కెగిరెడి సింగంబు
ముట్టునే కుఱుచైన ♦ మూషికమును
నవచూతపత్రముల్ ♦ నమలుచున్న పికంబు
గొఱుకునే జిల్లేడు ♦ కొనలునోట
నరవింద మకరంద ♦ మనుభవించెడి తేటిఁ
పోవునే పల్లేరు ♦ పూలకడకు
లలితమైన రసాల ఫలముఁ ♦ గోరెడి చిల్క
మెసవునే భ్రమత ను ♦ మ్మెత్తకాయ

తే. నిలను నీకీర్తనల పాడ ♦ నేర్చినతఁడు
పరులకీర్తనఁ బాడునే ♦ యరసిచూడ॥ భూ॥ 76

సీ. సర్వేశ నీపాద ♦ సరసిజద్వయమందుఁ
జిత్తముంపఁగలేను ♦ జెదరకుండ

నీవైనదయయుంచి నిలిచి ♦ యుండెడినట్లు
చేసి నన్నిప్పు డేలు ♦ సేవకుఁడను
వనజలోచన నేను ♦ వట్టి మూర్ఖుఁడజుమ్మి
నీస్వరూపముఁ జూడ ♦ నేర్పువేగ
తనకుమారున కుగ్గు ♦ తల్లిపోసినయట్లు
భక్తిమార్గంబను ♦ పాలుపోసి
తే. ప్రేమతో నన్నుఁబోషించి ♦ పెంచుకొనుము
ఘనతకెక్కించు నీదాస ♦ గణములోన॥ భూ॥ 77

సీ. జీమూతవర్ణ నీ ♦ మోముతో సరిరాక
కమలారి యతి కళం ♦ కమునఁ బడియె
సొగసైన నీనేత్ర ♦ యుగముతో సరిరాక
నళినబృందము నీళ్ళ ♦ నడుమఁ జేరెఁ
గరిరాజవరద నీ ♦ గళముతో సరి రాక
పెద్దశంఖము బొబ్బ ♦ పెట్టఁదొడఁగె
శ్రీపతి నీదివ్య ♦ రూపుతో సరి రాక
పుష్పబాణుఁడు నీకు ♦ బుత్రుఁడయ్యె
తే. నిందిరాదేవి నిన్ను మో ♦ హించి విడక
నీకు బట్టమహిషియయ్యె ♦ నిశ్చయముగ॥ భూ॥ 78

సీ. హరిదాసులను నింద ♦ లాడకుండినఁ జాలు
సకల గ్రంథమ్ములు ♦ చదివినట్లు
భిక్షమియ్యంగఁ ద ♦ ప్పింప కుండినఁ జాలు
జేముట్టి దానంబు ♦ చేసినట్లు
మించి సజ్జనుల వం ♦ చించ కుండిన జాలు
నింపుగా బహుమాన ♦ మిచ్చినట్లు

దేవాగ్రహారముల్ ♦ దీయకుండినఁ జాలుఁ
గనక కంబపు గుళ్ళు ♦ గట్టినట్లు
తే. కేకని వర్షాశనము ముంచ ♦ కున్నంజాలుఁ
దేరుకీర్తిగ సత్రముల్ ♦ పెట్టినట్లు॥ భూ॥ 79

సీ. ఇహలోక సౌఖ్యము ♦ లిచ్ఛగించెదమన్న
దేహ మెప్పటికిఁదా ♦ స్థిరతనొంద
దాయుష్యమున్న ప ♦ ర్యంతము పట్టుతయు
నొక్కతీరున నుండ ♦ సృష్టిలోన
బాల్యయువత్వ దు ♦ ర్బల వార్ధకములను
మూఁటిలో మునిఁగెడి ♦ మురికికొంప
భ్రాంతితో దీని గా ♦ పాడుద మనుకొన్నఁ
గాలమృత్యువుచేత ♦ గోలుపోవు
తే. నమ్మరాదయ్య యిది మాయ ♦ నాటకంబు
జన్మమింకనొల్ల నన్నేలు ♦ జలజనాభ !॥ భూ॥ 80

సీ. వదనంబు నీనామ ♦ భజనగోరుచునుండు
జిహ్వ నీకీర్తనల్ ♦ సేయఁగోరు
హస్తయుగ్మంబు ని ♦ న్నర్చింపఁగోరును
కర్ణముల్ నీమీఁది ♦ కథలుఁగోరుఁ
దనువు నీ సేవయే ♦ ఘనముగా గోరును
నయనముల్ నీదర్శ ♦ నంబుఁగోరు
మూర్ధ నీపాదముల్ ♦ మ్రొక్కఁగాఁ గోరును
ఆత్మ నీదయ యుండు ♦ నరసిచూడ
తే. స్వప్నముననైన నేవేళ ♦ సంతతమును
బుద్ధి నీపాదములయందు ♦ బూనియుండు॥ భూ॥ 81

సీ. పద్మాక్షమమతచే ♦ బరము సందేద మంచు
విష్ణువీగెదమయ్య ♦ వెట్టిపట్టి
మాస్వతంత్రంబైన ♦ మదము గండ్లకుఁగప్పి
మొగము పట్టదు కామ ♦ మోహమునను
బ్రహ్మదేవుండైన ♦ బైఁడిదేహముగల్గ
జేసివేయక మమ్ముఁ ♦ జెఱిచెనతఁడు
తుచ్ఛమైనటువంటి ♦ తోలెమ్ముకలతోడి
ముఱికిచెత్తలు చేర్చి ♦ మూటకట్టె
తే. నీశరీరాలు పడిపోవు ♦ తెలియఁగ కేము
కాముకుల మైతిమిక మిమ్ము ♦ గానలేము॥ భూ॥ 82

సీ. గరుడవాహన దివ్య ♦ కౌస్తుభాలంకార
రవికోటితేజ సా ♦ రంగవదన
మణిగణాన్వితహేమ ♦ మకుటాభరణ చారు
మకరకుండల లస ♦ న్మందహాస
కాంచనాంబర రత్న ♦ కాంచీవిభూషిత
సురవరార్చిత చంద్ర ♦ సూర్యనయన
కమలనాభ ముకుంద ♦ గంగాధరస్తుత
రాక్షసాంతక నాగ ♦ రాజశయన
తే. పతితపావన లక్ష్మీశ ♦ బ్రహ్మజనక
భక్తవత్సల సర్వేశ ♦ పరమపురుష॥ భూ॥ 83

సీ. పలుమాఱు దశరూప ♦ ములు ధరించితివేల
నేకరూపమునఁ బొంద ♦ వేలనీవు
నయమునక్షీరాబ్ధి ♦ నడుమఁజేరితి వేల
రత్నకాంచన మంది ♦ రములు లేవె

పన్నగేంద్రునిమీఁద ♦ బవ్వళించితివేల
జలతారుపట్టె ♦ మంచములు లేవె
ఱెక్కలుగలపక్షి ♦ నెక్కిసాగితివేల
గజతురంగాందోళి ♦ కములులేవె
తే. వనజలోచన యిటువంటి ♦ వైభవములు
సొగసుగానీకుఁదోఁచెనో ♦ సుందరాంగ !॥ భూ॥ 84
సీ. తిరుపతిస్థలమందుఁ ♦ దిన్నగా నే నున్న
వేంకటేశుఁడు మేత ♦ వేయలేడొ
పురుషోత్తమునకుఁ ♦ బోయినజాలఁ జ
గన్నాథుఁడన్నంబుఁ ♦ గడపఁలేడొ
శ్రీరంగమునకు నేఁ ♦ జేరబోయినఁజాలు
స్వామి గ్రాసముఁబెట్టి ♦ సాకలేడొ
కాంచీపురములోనఁ ♦ గదసి నే కొలువున
గరివరదుఁడు పొట్ట ♦ జరపలేడొ
తే. యెందుఁ బోవక నేను నీ ♦ మందిరమున
నిలిచితిని నీకు నామీఁద ♦ నెనరులేదు॥ భూ॥ 85
సీ. తార్క్ష్యవాహన నీవు ♦ దండిదాతవటంచుఁ
గోరి వేడుకనిన్నుఁ ♦ గొల్వవచ్చి
యర్థిమార్గమును నే ♦ ననుసరించితినయ్య
లావైన బదునాల్గు ♦ లక్షలైన
వేషముల్ వేసి నా ♦ విద్యాప్రగల్భత
జూపసాగితి నీకు ♦ సుందరాంగ
యానందమైననే ♦ నడుగవచ్చినదిచ్చి
వాంఛఁదీర్పుము నీల ♦ వర్ణ వేగ

తే. నీకు నావిద్య హర్షంబు ♦ గాకయున్న
తేప తేపకు వేషముల్ ♦ వేనువిమ్ము॥ భూ॥ 86

సీ. అమరేంద్రవినుత నే ♦ నతి దురాత్ముఁడనంచుఁ
గలలోననైన నను ♦ గనులఁబడవు
నీవు ప్రత్యక్షమై ♦ నిలువకుండినమాని
దొడ్డగా నొకయుక్తి ♦ దొరకెనయ్య
గట్టిగా ధ్యానమదెచ్చి ♦ ఘనముగా ఖండించి
నీ స్వరూపముచేసి ♦ నిలుపుకొందు
ధూపదీపములిచ్చి ♦ తులసితో బూజించి
నిత్యనైవేద్యముల్ ♦ నేమముగను
తే. నడుపుచును నిన్నుఁ గొలిచెద ♦ నమ్మి బుద్ధి
నీ ప్రపంచంబు గలిగె నా ♦ కింతేచాలు॥ భూ॥ 87

సీ. భువనేశ గోవింద ♦ రవికోటి సంకాశ
పక్షివాహన భక్త ♦ పారిజాత
యంభోజభవరుద్ర ♦ జంభారి సన్నుత
సామగానవిలోల ♦ సారసాక్ష
వనధిగంభీర శ్రీ ♦ వత్స కౌస్తుభవక్ష
శంఖచక్రగదాసి ♦ శార్ఙ్గహస్త
దీనరక్షక వాసు ♦ దేవ దైత్యవినాశ
నారదార్చిత దివ్య ♦ నాగశయన
తే. చారునవరత్న కుండల ♦ శ్రవణయుగళ
విబుధవందిత పాదాబ్జ ♦ విశ్వరూప॥ భూ॥ 88

సీ. నాగేంద్రశయన నీ ♦ నామ మాధుర్యంబు
మూఁడుకన్నుల సాంబ ♦ మూర్తి కెఱుక

పంకజాక్షా నీ ♦ బలపరాక్రమమెల్ల
భారతీపతియయిన ♦ బ్రహ్మ కెఱుక
మధుకైటభారి నీ ♦ మాయాసమర్థత
వసుధలో బలిచక్ర ♦ వర్తి కెఱుక
పరమాత్మ నీదగు ♦ పక్షపాతిత్వంబు
దశశతాక్షుల పురం ♦ దరుని కెఱుక
తే. వీరి కెఱుకగు నీకథల్ ♦ వింతలెల్ల
నరుల కెఱుకన్న నెవరైన ♦ నన్నుఁబోర॥ భూ॥ 89
సీ. అందమైన ని ♦ న్నడుగవచ్చెదరంచు
క్షీరసాగరమందుఁ ♦ జేరినావు
నీచుట్టు సేవకుల్ ♦ నిలువకుండుటకునై
భయదసర్పముమీఁదఁ ♦ బండినావు
భక్తబృందము వెంటఁ ♦ బడి చరించెద రంచు
నెగసిపోయెడి పక్షి ♦ నెక్కినావు
దాసులు నీ ద్వార ♦ మాసింపకుంటకు
మంచియోధుల కాన ♦ లుంచినావు
తే. లావుగలవాఁడవైతి వే ♦ లాగు నేను
నిన్నుఁ జూతును నాతండ్రి ♦ నీరజాక్ష॥ భూ॥ 90
సీ. నీకథల్ చెవులలో ♦ సోఁకుట మొదలుగాఁ
బులకాంకురము మేనఁ ♦ బుట్టువాఁడు
నయమైన నీదివ్య ♦ నామకీర్తనలోన
మగ్నుఁడై దేహంబు ♦ మఱచువాఁడు
ఫాలంబుతో నీదు ♦ పాదయుగ్మమునకుఁ
బ్రేమతో దండ ♦ మర్పించువాఁడు

హాపుండరీకాక్ష ♦ హా రామ హరి యంచు
వేడ్కతోఁ గేకలు ♦ వేయువాఁడుఁ
తే. చిత్తకమలంబుననను నిన్నుఁ ♦ జేర్చువాఁడు
నీదు లోకమునందుండు ♦ నీరజాక్ష !॥ భూ॥ 91

సీ. నిగమగోచర నేను ♦ నీకు మెప్పగునట్లు
లెస్సగాఁ బూజింపఁ ♦ లేనుజుమ్మి
నాఁకు దోఁచిన భూష ♦ ణములు పెట్టెదనన్న
గౌస్తుభమణి నీకుఁ ♦ గలదు ముందె
భక్ష్యభోజ్యముల ♦ నర్పణముఁ చేసెదనన్న
నీవుపెట్టితి సుధ ♦ నిర్జరులకుఁ
గలిమికొలఁదిగాను ♦ కల నొసంగెదనన్న
భార్గవీదేవి నీ ♦ భార్యయయ్యె
తే. నన్ని గలవాఁడ వఖిల ♦ లోకాధిపతివి
నీకుసొమ్ములు పెట్ట నే ♦ నెంతవాడ !॥ భూ॥ 92

సీ. నవసరోజదళాక్ష ♦ నన్నుఁ బోషించెడు
దాతవు నీవంచు ♦ ధైర్యపడితి
నామనంబున నిన్ను ♦ నమ్మినందుకుఁ దండ్రి
మేలునాకొనరింపు ♦ నీలదేహ
భళిభళీ! నీయంత ♦ ప్రభువు నెక్కడఁ జూడ
బుడమిలో నీపేరు ♦ బొగడవచ్చు
ముందుజేసిన పావ ♦ మును నశింపగఁజేసి
నిర్వహింపుము నన్ను ♦ నేర్పుతోడ
తే. బరమ సంతోషమాయె నా ♦ ప్రాణములకు
నీఋణముఁ దీర్చుకొననేర ♦ నీరజాక్ష !॥ భూ॥ 93

సీ. ఫణుల పుట్టలమీఁద ♦ బవ్వళించినయట్లు
పులులచోటుల జేరఁ ♦ బోయినట్లు
మకరవర్గంబున్న ♦ మడుగుఁ జొచ్చినయట్లు
గంగదాపున నిండ్లు ♦ గట్టినట్లు
చెదలభూమిని జాఁప ♦ చెలఁగఁ బరచినయట్లు
ఓటిబిందెలఁ బాల ♦ నునిచినట్లు
వెట్టివానికిబహు ♦ విత్తమిచ్చినయట్లు
కమ్మగుడిసెయందుఁ ♦ గాల్చినట్లు
తే. స్వామి నీభక్తవరులు ♦ దుర్జనులతోడఁ
జెలిమిఁ జేసినయట్లైన ♦ జేటువచ్చు॥ భూ॥ 94

సీ. దనుజసంహార నీకు ♦ దండంబుదండంబు
ఇందిరాధిపనీకు ♦ వందనంబు
పతితపావననీకు ♦ బహునమస్కారముల్
నీరజాతదళాక్ష ♦ నీకు శరణు
వాసవార్చిత మేఘ ♦ వర్ణ నీకు శుభంబు
మందరధర నీకు ♦ మంగళంబు
కంబుకంధర శార్ఙ్గ ♦ కర నీకు భద్రంబు
దీనరక్షక నీకు ♦ దిగ్విజయము
తే. సకల వైభవము నీకు ♦ సార్వభౌమ
నిత్యకల్యాణములు నగు ♦ నీకు నెపుడు॥ భూ॥ 95

సీ. మత్స్యావతారమై ♦ మడుఁగులోపలఁ జొచ్చి
సోమకాసురుఁ దునిమి ♦ చోద్యముగను
దెచ్చి వేదములెల్ల ♦ దేవభూసురులకు
మెచ్చియిచ్చితి వీవు ♦ మేలునొంద

నా వేదముల నియ్యు ♦ నాచారనిష్ఠల
 ననుభవించుచు నుందు ♦ రవని సురులు
సకల పాపంబులు సమసి ♦ పోవు నటంచు
 మనుజు లందఱు ♦ నీదు మహిమఁదెలిసి
తే. యుందు రిటువంటివారు నీ ♦ యునికిఁదెలియు
 వారలకు వేగ మోక్షంబు ♦ వచ్చునసఘ॥ భూ॥ 96

సీ. కూర్మావతారమై ♦ కుదరంబుక్రిందను
 గోర్కెతో నుండవా ♦ కోమరు మిగుల
వరహావతారమై ♦ వనభూములను జొచ్చి
 శిక్షింపవా హిర ♦ ణ్యాక్షు నపుడు
నరసింహమూర్తివై ♦ నరభోజను హిరణ్య
 కశిపుని ద్రుంపవా ♦ కాంతిమీఱ
వామనరూపమై ♦ వసుధలో బలిచక్ర
 వర్తిననణంపవా ♦ వైరముడిగి
తే. యిట్టిపను లెల్లఁ జేయఁగా ♦ నెవ్వరికిని
 దగును నరసింహ నీకె కాఁ ♦ దగును గాక॥ భూ॥ 97

సీ. లక్ష్మీశనీదివ్య ♦ లక్షణగుణముల
 వినజాల కెప్పుడు ♦ వెఱ్ఱినైతి
నావెఱ్ఱిగుణములు ♦ నయముగా ఖండించి
 నన్నురక్షించుమో ♦ నళిననేత్ర
నిన్ను నేనమ్మితి ♦ నితరదైవముల నే
 నమ్మలే దెప్పుడు ♦ నాగశయన
కాపాడినను నీవె ♦ కష్టపెట్టిన నీవె
 నీపాదకమలముల్ ♦ నిరత మేను

తే. నమ్మియున్నాను నీపాద ♦ నళినభక్తి
వేగ దయచేసి రక్షించు ♦ వేద వేద్య !॥ భూ॥ 98

సీ. అమరేంద్రవినుత ని ♦ న్ననుసరించినవారు
ముక్తిఁ బొందిరి వేగ ♦ ముదముతోడ
నీపాదపద్మముల్ ♦ నెఱ నమ్మియున్నాను
నాకు మోక్షంబిమ్ము ♦ నళిననేత్ర
కాచి రక్షించు నన్ ♦ గడ తేర్చు వేగమే
నీ సేవకునిఁ జేయు ♦ నిశ్చయముగఁ
గాపాడినను నీకుఁ ♦ గైంకర్యపరుఁడనై
చెలఁగి నీపనులను ♦ జేయువాఁడ

తే. ననుచుఁ బలుమాఱు వేఁడెద ♦ నబ్జనాభ
నాకుఁ బ్రత్యక్షమగు ♦ నిన్నె నమ్మినాను॥ భూ॥ 99

సీ. శేషప్పయనుకవి ♦ చెప్పినపద్యముల్
చెవులకానందమై ♦ చెలగుచుండు
నే మనుజుండైన ♦ నెలమి నీశతకము
భక్తితో విన్న న ♦ త్ఫలము గలుగు
జెలఁగి యీపద్యము ♦ చేర్చి వ్రాసినవారు
కమలాక్షు కరుణను ♦ గాంతురెపుడు
నింపుగా పుస్తకం ♦ బెపుడుఁ బూజించిన
దురిత జాలంబులు ♦ దొలఁగిపోవు

తే. నిద్దిపుణ్యాకరం బని ♦ యెపుడు జనులు
గష్ట మెన్నక పఠియింపఁ ♦ గలుగుముక్తి॥ భూ॥ 100

నృసింహశతకము—సంపూర్ణము.

S. S. R. A. PRESS, ELLORE.—(1000–'46).

13442